

కోరలు చాస్తున్న 'క్షయ'

ఉమ్మడి జిల్లాలో చాపకింద నీరులా క్షయ విస్తరిస్తోంది. ఏటా కేసులు పెరుగుతూనే ఉన్నాయి. నేడు ప్రపంచ క్షయ నివారణ దినం సందర్భంగా కథనం. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
సోమవారం : 6:24	మంగళవారం : 5:00



వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

'స్పోర్ట్స్' విద్యార్థుల ప్రతిభ




కోచ్ రమేశ్‌తో మహేశ్, రితిక

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ క్రీడా పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఇంటర్నేషనల్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన పోటీల్లో అండర్–16 విభాగంలో జావెలిన్‌త్రోలో వి.మహేశ్ బంగారు పతకంతో మెరిశాడు. అలాగే అండర్–14 విభాగంలో పి.రితిక జావెలిన్ త్రోలో రజత పతకం సాధించినట్లు కోచ్ రమేశ్ తెలిపాడు.

స్వర్ణంతో మెరిసిన కుశవర్తి జాదవ్



కోచ్, మేనేజర్‌తో కుశవర్తి

జిల్లాకు చెందిన అథ్లెట్ జాదవ్ కుశవర్తి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటింది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఇంటర్నేషనల్ స్కూల్లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్–20 విభాగంలో జావెలిన్‌త్రోలో స్వర్ణ పతకంతో మెరిసింది. ఆమె వెంట కోచ్ సౌమ్య, మేనేజర్ అనిల్ ఉన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న కిరణ్

కైలాస్‌నగర్: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ గిరిజన విద్యార్థులకు 24 గంటల పాటు అందుబాటులో ఉండి వైద్యసేవలందిస్తున్న ఏఎన్‌ఎంలకు సెలవులు ఇవ్వకుండా వేతనాల్లో కోత విధించడం సరికాదన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, పింఛన్, ఇన్సూరెన్స్ సౌకర్యంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తూ గుర్తింపు కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో జిల్లా అధ్యక్షురాలు కమల, కోశాధికారి శ్యాంసుందర్, నర్మద, కామేశ్వరి, జంగుబాయి, అశ్విని, పాల్గొన్నారు.

ఐక్యంగా ఉద్యమించాలి



మాట్లాడుతున్న సుకుమార్ పేట్కులే

ఆదిలాబాద్‌రూరల్: మాలీలు ఎస్టీ హోదా విషయంలో ఐక్యంగా ఉద్యమించాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే అన్నారు. జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో గల పూలే గెస్ట్ హౌస్‌లో ఆదివారం మాలీ ఉద్యోగుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల జూనియర్ లెక్చరర్లుగా ఎంపికైన బెల్లపు నగేశ్, గురునులే దత్త సాంకాస్, ఉపాధ్యాయులుగా ఎంపికైన సాయికుమార్, ప్రధాన్ గిరిగాం, రాగి సంజీవ్, కుచ్లాపూర్ విజయ్, మాహుర్లే జైనథ్‌ను సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఇందులో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న, ఉపాధ్యక్షుడు సురేశ్, ప్రచార కార్యదర్శి మురళీధర్, జిల్లా అధ్యక్షుడు విజయ్ పాల్గొన్నారు.

బాబోయ్ దొంగలు!

☞ జిల్లా కేంద్రంలోని రిక్షా కాలనీలో గల ఓ ఇంట్లో పనిచేసేందుకు ఓ మహిళ నాలుగైదు నెలల క్రితం చేరింది. ఆ కుటుంబీకులను నమ్మించి దొంగతనానికి పాల్పడింది. డిజిటల్ లాకర్‌లో భద్రపరిచిన ఆభరణాలను సైతం సాంకేతిక పద్ధతి ఉపయోగించి ఎత్తుకెళ్లింది. యూట్యూబ్‌లో వీడియోలు చూసి లాకర్‌ను తెరిచినట్లు పోలీసుల వద్ద ఒప్పుకుంది. ఇందుకు సహకరించిన నిందితుడితో సహా పట్టుబడింది. ప్రస్తుతం కటకటాలు లెక్కిస్తున్నారు.

☞ ఆదిలాబాద్ పట్టణంలోని తాటిగూడ ప్రాంతంలో తన కుమారుడిని స్కూల్ నుంచి తీసుకురావడానికి వెళ్తున్న ఓ మహిళ మెడలో నుంచి గొలుసును ఓ కేటుగాడు లాక్కెళ్లాడు. స్కూల్ గేటు తీసేందుకు సహకరించినట్లు నటించి పని కానిచ్చాడు. పోలీసులు నిందితుడిని పట్టుకొని రిమాండ్‌కు తరలించారు.

☞ ఆదిలాబాద్ పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన ఓ మహిళను దుండగుడు నమ్మించి మోసగించాడు. సిమెంట్ బ్యాగులు కొనుగోలు చేసినందుకు లక్కీ కూపన్ వచ్చింది.. రూ.లక్ష విలువ గల వస్తువులు కానీ లేదంటే నగదు తీసుకోవచ్చని నమ్మించాడు. తన బైక్‌పైనే ఆ మహిళను తీసుకెళ్లి సిమెంట్ షాప్ మూసి ఉందని, అక్కడే ఉండాలని చెప్పాడు. ఆభరణాలు ఉంటే డబ్బులు ఇవ్వరని, తీసి తనకు ఇవ్వమని మాయమాటలు చెప్పి నమ్మించాడు. రెండున్నర తులాల బంగారం ఆయనకు ఇవ్వగా పరారయ్యాడు.



మహిళను నమ్మించి బైక్‌పై తీసుకెళ్తున్న కేటుగాడు (ఫైల్)

మావల మండల పరిధిలోని దస్నాపూర్‌లో గల నేషనల్ మార్ట్‌లో ఇటీవల ఓ దొంగ టెక్నాలజీ ఉపయోగించి చోరీకి పాల్పడ్డాడు. పైన రేకుల బోల్టులను తొలగించి లోనికి చొరబడ్డాడు. లాకర్‌ను కటర్ గ్రైండర్‌తో ఓపెన్ చేసి అందులోని రూ.4లక్షలకు పైగా నగదును ఎత్తుకెళ్లాడు. చొరబడిన పుటేజీలు సీసీ కెమెరాలో రికార్డు కాగా, ఆ తర్వాత సీసీ కెమెరా కనెక్షన్ తొలగించాడు.



- తాళం వేసిన ఇళ్లే టార్గెట్
- టెక్నాలజీ ఉపయోగించి దొంగతనాలు
- పెరిగిన గొలుసు, వాహన చోరీలు
- సీసీ నిఘా ఉన్నా తప్పించుకుంటున్న నిందితులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ఇటీవల దొంగతనాలు పెరిగిపోయాయి. టెక్నాలజీ ఉపయోగించి కేటుగాళ్లు చోరీలకు పాల్పడుతున్నారు. రాత్రి వేళల్లో దుకాణాలు, మాల్స్, తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేస్తున్నారు. అలాగే ద్విచక్ర వాహనం కనిపిస్తే మాయం చేస్తున్నారు. మహిళల మెడలో నుంచి బంగారు గొలుసులు లాక్కెళ్తున్నారు. సీసీ కెమెరాలు ఉన్నా వాటికి చిక్కకుండా జిమ్మిక్కులకు పాల్పడుతున్నారు. కొంత కాలంగా తగ్గుముఖం పట్టిన చోరీలు తాజాగా మళ్లీ మొదలవడంతో జిల్లావాసుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. దొంగలు దినమంతా రెక్కీలు నిర్వహించి రాత్రి వేళల్లో తమ పని కానిచ్చేస్తున్నారు. కంటి మీద కునుకులేకుండా చేస్తున్న వీరిని పోలీసులు సైతం వెంటనే పట్టుకొని రిమాండ్‌కు తరలిస్తున్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని వారు సూచిస్తున్నారు. అపరిచిత వ్యక్తులు ఎవరైనా సందర్శిస్తే తమకు సమాచారం అందించాలని చెబుతున్నారు.

ఆగని చోరీలు..

జిల్లాలో కొంతకాలంగా చోరీలు ఆగడం లేదు. ఆయా ప్రాంతాల్లో దొంగలు ఉదయం పూట రెక్కీ నిర్వహిస్తున్నారు. చిరు వ్యాపారులుగా, భిక్షాటన చేస్తూ తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేస్తున్నారు. రాత్రి సమయంలో అందులోకి చొరబడి తమ పని కానిచ్చేస్తున్నారు. అలాగే ఇళ్ల ముందర పార్కింగ్ చేసిన బైక్‌లు, రిమ్స్ ఆస్పత్రి, ఆయా షాపుల ఎదుట పార్కింగ్ చేసిన వాహనాలను ఎత్తుకెళ్లి మహారాష్ట్రలో విక్రయిస్తున్నారు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. కష్టపడి సంపాదించిన ధనం దొంగల పాలు కావడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ ఏడాది జిల్లాలో దాదాపు 350కి పైగా దొంగతనాలు జరిగాయి. ఇటీవల ఆదిలాబాద్ పట్టణంలోని నేషనల్ మార్ట్‌లో రూ.4లక్షలకు పైగా ఎత్తుకెళ్లారు. దొంగల కోసం పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నారు.

సీసీ కెమెరాలకు చిక్కకుండా..

జిల్లా కేంద్రంలోని ఆయా ముఖ్య కూడళ్లతో పాటు కాలనీల్లో 200 వరకు సీసీ కెమెరాలు ఉన్నాయి. వీటిని పోలీసు కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. పట్టణంలో పలు అభివృద్ధి పనులు జరగడంతో పలుచోట్ల ఈ కెమెరాలు పనిచేయడం లేదు. అలాంటి ప్రాంతాల్లో చోరీలు జరిగినప్పుడు దొంగలను పట్టుకోవడం కొంత ఇబ్బందిగా మారుతుంది. సీసీ కెమెరాల ఆవశ్యకతపై దుకాణదారులతో పాటు ఆయా గ్రామాల్లో ప్రజలకు పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.

పెట్రోలింగ్‌తో నిఘా ఏర్పాటు చేశాం..



దొంగతనాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ పెంచి నిఘా కట్టుదిట్టం చేస్తున్నాం. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశాం. దుకాణాల ఎదుట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా దొంగతనాలు జరిగినప్పుడు నిందితులను పట్టుకోవడానికి ఆస్కారం ఉంటుంది. షాపుల్లో నగదును పెద్ద మొత్తంలో ఉంచవద్దు. సాంకేతిక పద్ధతులు ఉపయోగించి దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.

– అఖిల్ మహాజన్, ఎస్పీ

ఎల్‌ఆర్‌ఎస్ రాయితీ సద్వినియోగం చేసుకోండి



సందేహాలను నివృత్తి చేస్తున్న కమిషనర్ రాజు

కైలాస్‌నగర్: అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం చేపట్టిన ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సీవీఎన్.రాజు అన్నారు. దరఖాస్తుదారుల సౌకర్యార్థం పట్టణంలోని న్యూహౌసింగ్ బోర్డు కాలనీలో మున్సిపల్ ఆధ్వర్యంలో ఆదివారం ఎల్‌ఆర్‌ఎస్ మేళా నిర్వహించారు. దరఖాస్తుదారుల సందేహాలు నివృత్తి చేయడంతో పాటు ప్రక్రియ నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 31వరకు ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవడం ద్వారా ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులో 25శాతం రాయితీ పొందవచ్చన్నారు. ఫీజు చెల్లించిన వారికి వెంటనే ప్రొసీడింగ్ పత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీపీఎస్ నవీన్ కుమార్, వార్డు అధికారి అక్షయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

- ఈనెల 27వరకు దరఖాస్తుకు అవకాశం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో హమాలీల భర్తీకి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణకు మార్కెటింగ్ అధికారులు ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో 100 మంది, జైనథ్ మార్కెట్ యార్డు పరిధిలో జైనథ్‌లో 100, బేల సబ్ మార్కెట్‌లో 50 మంది, ఇచ్చోడలో 30, బోథ్‌లో 32, ఇంద్రవెల్లి మార్కెట్‌యార్డు పరిధిలో ఇంద్రవెల్లిలో 30, నార్నూర్‌లో 20 మంది హమాలీలను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 24 నుంచి 27వరకు సంబంధిత మార్కెట్ యార్డుల్లో సాయంత్రం ఐదు గంటల్లోపు అందజేయాలన్నారు. ఒక వ్యక్తి ఒకే మార్కెట్‌యార్డులో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శారీరక సామర్థ్యం (బ్యాగ్‌లోడింగ్, అన్‌లోడింగ్) పరీక్ష ఆధారంగా హమాలీలను నియమించనున్నట్లు పేర్కొన్నారు.

ఇక సన్నబియ్యం..

- రేషన్‌కార్డుదారులకు ఉగాది కానుక
- ఏప్రిల్ 1 నుంచి పంపిణీకి ఏర్పాట్లు
- లబ్ధిదారుల్లో హర్షం

జిల్లాలోని ప్రజా పంపిణీ వివరాలు
చౌక ధరల దుకాణాలు : 356
మొత్తం రేషన్‌కార్డులు : 1,92,233
కార్డుల్లోని యూనిట్లు : 6,32,819
అవసరమైన బియ్యం కోటా : 4,035 మెట్రిక్ టన్నులు



చౌక ధరల దుకాణంలో బియ్యం పంపిణీ (ఫైల్)

కైలాస్‌నగర్: ఉగాది పండగ పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం పేదలకు తీపి కబురు అందించింది. ఆహారభద్రత కార్డుదారులకు ఏప్రిల్ 1నుంచి సన్నబియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం డీలర్ల వద్ద నిల్వ ఉన్న దొడ్డుబియ్యం మొత్తం వెనక్కి పంపించాలని ఆదేశించింది. ఈ మేరకు అవసరమైన చర్యలు ముమ్మరం చేసింది. సర్కారు తాజా నిర్ణయంతో సన్నబియ్యం కొనుగోలు చేయలేని పేదలకు ప్రయోజనం చేకూరనుంది. అలాగే అక్రమంగా సాగుతున్న రేషన్ బియ్యం దందాకు చెక్‌పడే అవకాశముంది.

అక్రమ దందాకు చెక్..

ఆహారభద్రత కార్డుదారులకు ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా ఒక్కో వ్యక్తికి ఆరు కిలోల చొప్పున బియ్యం అందజేస్తోంది. ఇవి దొడ్డువి కావడంతో చాలా మంది వీటిని తినడానికి ఇష్టపడటం లేదు. అలాంటి వారు తమకు రావాల్సిన కోటా బియ్యంను డీలర్లకే కిలో రూ.13 నుంచి రూ.15 చొప్పున విక్రయించేస్తున్నారు. ఇలా కొనుగోలు చేసిన బియ్యంను డీలర్లు వ్యాపారులకు రూ.20 నుంచి రూ.22 చొప్పున విక్రయిస్తున్నారు. మరి కొంతమంది బియ్యంను నెలల తరబడి నిల్వ చేసి తమ ఇంటి వద్దకు ఆటోలతో వచ్చే వారికి అమ్ముతున్నారు. పేదలకు అందాల్సిన ఈ రేషన్ బియ్యంను దళారులు, వ్యాపారులు కలిసి మహారాష్ట్రకు లారీల్లో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంతో ఈ దందా యథేచ్ఛగా సాగుతూ వస్తోంది. తాజాగా సన్నబియ్యం పంపిణీ ద్వారా ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట పడనుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

నాణ్యతపై సందేహాలు

గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కూడా సన్న బియ్యం అందించే ప్రయత్నం చేసినప్పటికీ నాణ్యత కొరవడింది. రెండు, మూడు నెలల పాటు సరఫరా చేయగా అందులో నూకలు, తౌడు రావడంతో పేదలు వాటిని తినకుండా వ్యాపారులకు విక్రయించారు. ఈ క్రమంలో ప్రస్తుత ప్రభుత్వం పంపిణీ చేయనున్న బియ్యం నాణ్యతపై కార్డుదారుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ప్రభుత్వం సన్నవడ్లకు రూ.500 బోనస్ అందజేసి కొనుగోలు చేయడంతో నాణ్యమైన బియ్యం వచ్చే అవకాశముందనే అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు. దీంతో పేదలకు మేలు చేకూరనుంది.

కొత్త కార్డుదారులకు లేనట్లేనా...

సర్కారు నిర్ణయంపై ఆహారభద్రత కార్డుదారుల్లో ఆనందం వ్యక్తమవుతుండగా కొత్తకార్డుల కోసం ఎదురుచూస్తున్న వారికి మాత్రం నిరాశే మిగులుతుంది. కొత్త కార్డుల జారీ ప్రక్రియకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్‌గా మండలానికి ఒక గ్రామం చొప్పున 17 గ్రామాల్లోని 800 మందికి మాత్రమే జారీ చేసింది. వాటికి బియ్యం కోటా కూడా విడుదల చేసింది. మిగతా గ్రామాల వారికి కార్డులు జారీ చేయనుండగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియకు బ్రేక్ పడింది. కార్డులు రాకపోవడంతో వారికి సన్నబియ్యం పొందే అవకాశం లేకుండా పోతుంది.

పంపిణీకి చర్యలు

పేదలకు సన్నబియ్యం అందించే దిశగా అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. ప్రస్తుతం రేషన్ దుకాణాల్లో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం పూర్తిగా వెనక్కి తీసుకోవాలని సూచించింది. ఆ దిశగా డీలర్లకు ఆదేశాలు జారీ చేశాం. జిల్లాకు అవసరమైన సన్నబియ్యం కోటాను ఈ సారి నిజామాబాద్ జిల్లాకు కేటాయించారు. అక్కడి నుంచి ఎంఎల్‌ఎస్ పాయింట్లకు సరఫరా చేసేలా చర్యలు చేపడుతున్నాం. ఏప్రిల్ 1 నుంచి లబ్ధిదారులకు పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాం.

–ఎండీ.వాజీద్‌అలీ, జిల్లా పౌరసరఫరాల అధికారి

సర్టిఫికెట్ల టైం..

- 'రాజీవ్ యువ వికాసం' ఎఫెక్ట్
- రెవెన్యూ కార్యాలయాల్లో సందడి
- పెరిగిన దరఖాస్తుదారుల తాకిడి
- ఇదే అదునుగా దళారుల దోపిడీ



ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సర్టిఫికెట్ల జారీలో నిమగ్నమైన ఉద్యోగులు

కైలాస్‌నగర్: జిల్లాలోని రెవెన్యూ కార్యాలయాలకు దరఖాస్తుదారుల తాకిడి ఒక్కసారిగా పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వం పదేళ్ల తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా రూ.4లక్షల వరకు సబ్సిడీతో కూడిన రుణాలను అందజేస్తామని ప్రకటించింది. అయితే దరఖాస్తు చేసుకునేందుకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి. అలాగే ఆదాయ ధ్రువీకరణ పత్రం తాజాగా పొందినదై ఉండాలనే నిబంధనతో ఆశావహులు వాటి కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా మీసేవ కేంద్రాలన్నీ కిటకిటలాడుతున్నాయి. రెవెన్యూ కార్యాలయాల నుంచి ఆ సర్టిఫికెట్లు తీసుకోవాల్సి ఉండటంతో దరఖాస్తుదారులంతా సంబంధిత తహసీల్దార్ కార్యాలయాలకు పరుగు పెడుతున్నారు. ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సాధారణ సమయంలో రోజుకు కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాల కోసం 50 వరకు దరఖాస్తులు అందేవని, ప్రస్తుతం మూడు రోజుల్లోనే 700 వరకు అందాయని అక్కడి అధికారులు చెబుతుండటం పరిస్థితికి అద్దం పడుతోంది. ఈ ఒక్క కార్యాలయమే కాదు.. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి. అన్ని మండలాల్లో కలిపి రోజుకు వెయ్యికి పైగానే దరఖాస్తులు అందుతున్నట్లుగా అధికారులు పేర్కొంటున్నారు. మరోవైపు సర్వర్ సమస్య కూడా వేధిస్తోంది. కుప్పలు తెప్పలుగా అందుతున్న దరఖాస్తుల వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేస్తుండటంతో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ఫలితంగా వివరాల నమోదులో జాప్యం అవుతుందని రెవెన్యూ సిబ్బంది చెబుతున్నారు.

దళారుల జోరు

ప్రభుత్వ సాయం కోసం చేసే దరఖాస్తుకు రెవెన్యూ సర్టిఫికెట్లు అవసరముండటంతో ఇదే అదునుగా కొంతమంది దళారుల అవతారమెత్తుతున్నారు. అమాయకుల అవసరాన్ని ఆసరాగా చేసుకుంటున్నారు. రెండు రోజుల్లో ఇస్తామని చెబుతూ ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.300 నుంచి రూ.500 వరకు వసూలు చేస్తున్నారు. చేసేదిలేక కొంతమంది వారడిగినంత ముట్ట జెబుతున్నారు. ఇలా దళారులు ఒక్కొక్కరు పదుల సంఖ్యలో మీసేవ దరఖాస్తు రశీదులతో రెవెన్యూ కార్యాలయాల్లో వాలిపోతున్నారు. అక్కడి సిబ్బందిని మచ్చిక చేసుకుని సర్టిఫికెట్లు పొందే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో సామాన్యులకు మాత్రం తిప్పలు తప్పడం లేదు. అధికారులు ఇప్పటికైనా ఆ దిశగా దృష్టి సారించి దళారుల జోక్యం కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఎండుతున్న ఆశలు



“ఇక్కడ సాగునీరందక ఎండిపోయి కనిపిస్తున్న ఈ జొన్నపంట తాంసి మండలంలోని గోట్కూరి శివారులోనిది. జందాపూర్ గ్రామానికి చెందిన ఉప్కముల్ల చందు తనకున్న రెండున్నర ఎకరాల్లో మత్తడివాగు ప్రాజెక్టు ఎడమకాలువ కింద యాసంగిలో జొన్న సాగు చేశాడు. అయితే గోట్కూరి శివారులో ఉన్న కాలువకు నెల క్రితమే సాగునీరు నిలిచిపోయింది. మరోవైపు చేలో ఉన్న బోరుబావి సైతం అడుగంటింది. పంట దాదాపు సగానికి పైగా ఎండిపోయింది. ఉన్న కొద్దిపాటి నీటితో ప్రస్తుతం ఎకరం వరకే నీరందుతుంది. ఈ ఒక్క రైతే కాదు.. మత్తడివాగు, సాత్నాల ప్రాజెక్టుల ఆయకట్టు పరిధిలోని చాలా మంది రైతులది ఇదే పరిస్థితి.

- ప్రాజెక్టుల్లో తగ్గుతున్న నీటిమట్టం
- అడుగంటుతున్న మత్తడివాగు, సాత్నాల
- యాసంగి పంటలకు అందని సాగునీరు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు



ఎండిపోతున్న మత్తడివాగు ప్రాజెక్టు

ప్రాజెక్టు	నీటిమట్టం (మీటర్లలో)		నిల్వ సామర్థ్యం (టీఎంసీలో)	
	పూర్తిస్థాయి	ప్రస్తుతం	పూర్తిస్థాయి	ప్రస్తుతం
మత్తడివాగు	277.50	272.90	0.571	0.146
సాత్నాల	286.50	279.90	1.24	0.196

తాంసి: జిల్లాలో రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగుతోంది. ఇప్పటికే గ్రామాల్లో చెరువులు, కుంటలు ఎండిపోతున్నాయి. ప్రాజెక్టులు సైతం అడుగుంటుతున్నాయి. మరోవైపు పంట చేలల్లో బావులు, బోరుబావుల్లో భూగర్భజల మట్టం పడిపోతుంది. చాలా చోట్ల పంటలు వాడిపోయి ఎండిపోతున్నాయి. తాంసి మండలం వడ్డాడి శివారులో ఉన్న మత్తడివాగు ప్రాజెక్టు, సాత్నాల మండలంలోని సాత్నాల ప్రాజెక్టులో నీటి మట్టం క్రమంగా తగ్గిపోతుంది. ప్రస్తుతం వీటి పరిధిలోని ఆయకట్టుకు నీరందక పంటలు ఎండిపోతున్నాయి. దీంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మత్తడివాగు ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా తాంసి, భీంపూర్, ఆదిలాబాద్ రూరల్ మండలాల్లోని సుమారు 8,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. ఇక సాత్నాల ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ద్వారా జైనథ్, సాత్నాల మండలాల్లోని సుమారు 26వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ప్రస్తుతం ఎండల ప్రభావంతో ఈ ప్రాజెక్టులు క్రమంగా డెడ్‌స్టోరేజీకి చేరువవుతున్నాయి. మరోవైపు భూగర్భ జలాల మట్టం కూడా పడిపోతుండడంతో రైతులు ఎండిన పంటలు చూసి తమ ఆశలు ఆవిరైనట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా జొన్న, మొక్కజొన్న, గోధుమ తదితర పంటలకు పూర్తిస్థాయిలో సాగునీరందక ఎండిపోతున్నాయి. మార్చిలోనే పరిస్థితి ఇలా ఉంటే మేలో ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సాగునీటికి ఇబ్బందవుతుంది..



మత్తడివాగు ఎడమ కాలువపై ఆధారపడి నాలుగు ఎకరాల్లో జొన్న వేశాను. గోట్కూరి శివారులో ఉన్న చేనుకు కాలువ ద్వారా నీరందడం లేదు. ఎగువన ఉన్న రైతులు కాలువలో అడ్డుగా కట్టలు వేసి నీటిని వాడుకుంటున్నారు. దీంతో నీరు కిందికి రావడం లేదు. దూరంగా ఉన్న ప్రధాన కాలువల్లో మోటార్ ఏర్పాటు చేసి నీటిని అందించాల్సి వస్తోంది. చానా ఇబ్బంది అవుతుంది.

సురేశ్, రైతు, జందాపూర్

సరిపడా నీరు ఉంది

ఎండల తీవ్రత పెరగడంతో ప్రాజెక్టులో నీరు వేగంగా తగ్గుతుంది. అయినా ఎడమకాలువ ద్వారా ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తున్నాం. ప్రాజెక్టులో ప్రస్తుతం 272.90 మీటర్ల మేర నీరు నిల్వ ఉంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– హరీశ్ ఏఈ, మత్తడివాగు ప్రాజెక్టు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న సీఐ

భైంసారూరల్ (ముధోల్): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు రాంపూర్‌కు చెందిన సాయన్న, చర్లపల్లికి చెందిన రఫీక్ ఆదివారం పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై సుంక్లి గ్రామానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో వానల్‌పాడ్ గ్రామ సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడిపోవడంతో గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న సీఐ నైలు, స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విషాహారం తిని మూడు ఎద్దులు మృతి


ఎద్దు కళేబరం

మామడ: మండలంలోని గాయిద్‌పల్లిలో విషాహారం తిని మూడు ఎద్దులు మృత్యువాతపడ్డాయి. జాదవ్ పండరీకి చెందిన మూడు ఎద్దులు ఆదివారం పంటచేను సమీపంలో మృతిచెంది ఉన్నాయి. సంఘటన స్థలాన్ని పశువైద్యాధికారి మహేశ్ సందర్శించి వివరాలు సేకరించారు. విషాహారం తినడంతో మృతి చెందాయని పేర్కొన్నారు. వీటి విలువ రూ.2 లక్షల వరకు ఉంటుందని తెలిపారు.

అనారోగ్యంతో ఏఎంసీ మాజీ చైర్మన్ మృతి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు

ఇంద్రవెల్లి: అనారోగ్యంతో ఏఎంసీ మాజీ చైర్మన్ సోమసే వెంకట్‌రావ్(76) మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన ఈయన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు. 2005లో ఇంద్రవెల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. గత కొంతకాలం అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా ఆరోగ్యం కుదుటపడలేదు. పరిస్థితి విషమించి మండలకేంద్రంలోని ఆయన నివాసంలో ఆదివారం తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఘటన స్థలానికి చేరుకుని వెంకటరావ్ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. ఆయన మృతి పార్టీకి లోటన్నారు. ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, కాంగ్రెస్ నాయకులు మీర్జా యాకుబ్ బేగ్, ఎండీ మసుద్, జహీర్, గ్రామపటేల్ మారుతి డొంగ్రె తదితరులు ఉన్నారు.

కోరలుచాస్తున్న 'క్షయ'

రెండు వారాలకు మించి దగ్గు ఉందా..అయితే టీబీ అయ్యిండొచ్చు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి ఉచిత పరీక్షలు చేయించుకోవాలి. వ్యాధి నిర్ధారణ అయితే వైద్యులు మందులిస్తారు. చిన్నపాటి దగ్గే కదా అని నిర్లక్ష్యం చేస్తే అదే రేపు ప్రాణాంతకం అవ్వొచ్చు. ముందుగా జాగ్రత్త పడితే ఆరోగ్యం మీ చేతుల్లోనే భద్రంగా ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో చాప కింద నీరులా వ్యాపిస్తున్న క్షయ వ్యాధికి కళ్లెం వేయాలి. అందరం కలిసి క్షయను నిర్మూలించగలం అనే నినాదంతో ఈ ఏడాది ముందుకెళ్తున్నారు. నేడు ప్రపంచ క్షయ నివారణ దినం సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.

- ఏటా పెరుగుతున్న రోగుల సంఖ్య
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా నిష్ప్రయోజనం
- నేడు ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినం

మంచిర్యాలటౌన్: టీబీ నిర్మూలనకు ప్రభుత్వం నడుంబిగించింది. వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎంతో పటిష్ట చర్యలు తీసుకుంటున్నా క్షయ వ్యాధి తగ్గుముఖం పట్టకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఉమ్మడి జిల్లాలో చాపకింద నీరులా క్షయ విస్తరించడం, కొన్నేళ్లుగా వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందిస్తున్నా, ఏటా బాధితులు పెరుగుతున్నారు. కేంద్ర ప్రభుత్వం 2025 నాటికి టీబీని నిర్మూలించడమే లక్ష్యంగా గత ఐదేళ్లుగా కృషి చేస్తున్నా, ఏటా వీరి సంఖ్య వెయ్యికి పైగానే నమోదవుతోంది.

వ్యాధిని గుర్తిస్తారు ఇలా..

టీబీ.. మైకో బ్యాక్టీరియా ట్యూబర్‌కిలోసిస్ ద్వారా సంక్రమిస్తుంది. ఊపిరితిత్తులకు లేదా శరీరంలోని ఇతర భాగాలకు రెండు రకాలుగా వ్యాపిస్తుంది. 85 శాతం మందికి ఊపిరితిత్తులకే సోకడం గమనార్హం. రెండు వారాలకు మించి దగ్గు ఉండడం, సాయంత్రం వేళ జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, ఛాతీనొప్పి, దగ్గినప్పుడు రక్తంతో కూడిన తెమడ వస్తే వ్యాధి లక్షణాలుగా చెప్పవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. బాధితులకు వ్యాధి తీవ్రత బట్టి ఆరు, ఎనిమిది నెలలు, రెండేళ్ల కోర్సు ప్రకారం మందులు వాడాల్సి ఉంటుంది. వ్యాధిగ్రస్తుడు దగ్గినా, తుమ్మినా తుంపర్లు వాతావరణంలో కలిసి బ్యాక్టీరియా ద్వారా ఇతరులకు సంక్రమిస్తుంది. రోగ నిరోధకశక్తి తక్కువగా ఉన్నవారు దీని బారిన పడతారు. హెచ్‌ఐవీ, షుగర్ వ్యాధిగ్రస్తులు, అతిగా మద్యం సేవించేవారు, పొగతాగేవారు, గర్భిణులు, పిల్లల తల్లులు, సరైన పోషకాహారం తీసుకోనివారు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు త్వరగా దీని బారినపడే ప్రమాదం ఉంది. చికిత్సలో భాగంగా వ్యాధిగ్రస్తులు ప్రతీరోజు ట్యాబ్లెట్లను వేసుకునేలా ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్(ఎఫ్‌డీసీ) చికిత్స విధానాన్ని అనుసరిస్తున్నారు. ఈ వ్యాధిని నిర్ధారణకు అధునాతన సీబీనాట్(క్యాట్రిజ్ బేస్డ్ న్యూక్లిక్ ఆసిడ్ అంప్లీ క్లీన్ టెస్టు) విధానం (క్షయ నివారణ విభాగం కేంద్రం) మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో ఉండగా, బెల్లంపల్లి సీహెచ్‌సీలో టునాట్ మిషన్లను అందుబాటులోకి తెచ్చారు. మంచిర్యాల జిల్లా ఆసుపత్రిలో టీబీ టెస్టుల కోసం ప్రత్యేక గదిని కేటాయించి, సీబీనాట్‌తో పరీక్ష చేసి, చికిత్స అందిస్తున్నారు. టెస్టుల కోసం ట్రూనాట్ మిషన్‌ను ఏర్పాటు చేయగా, అనుమానితుల నుంచి శాంపిళ్లను సేకరించి, వ్యాధిని నిర్ధారిస్తున్నారు.


మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సీబీనాట్ యంత్రం

ఐదేళ్లలో గుర్తించిన టీబీ కేసులు

సంవత్సరం	మంచిర్యాల	ఆదిలాబాద్	నిర్మల్
2020	1,138	1218	1529
2021	1,284	1361	1208
2022	1,445	1565	1549
2023	1,413	1467	1378
2024	1,278	1602	1097

చికిత్సతో పాటు నగదు

క్షయ వ్యాధిగ్రస్తులకు చికిత్స పూర్తయ్యే వరకు నిక్షయ పోషణ యోజన కింద నెలకు రూ.వెయ్యి ఇస్తారు. ఈ డబ్బును వారి ఖాతాల్లో జమచేసి, ఆధార్, బ్యాంక్ ఖాతాలతో నిక్షయ పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. ప్రైవేటు నర్సింగ్‌హోంలు, ల్యాబ్‌లో పరీక్షలు చేసుకుని, వ్యాధి నిర్ధారణ అయితే వ్యాధిగ్రస్తుల వివరాలను సమీప ప్రభుత్వ ఆసుపత్రిలోని టీబీ యూనిట్ సిబ్బందికి తెలియజేయాలి. ఈ డబ్బులతో వ్యాధిగ్రస్తుడు బియ్యం, పప్పుదినుసులు, గుడ్లు, పాలు, కూరగాయలు కొనేందుకు గాను ఈ మొత్తాన్ని ఉపయోగించాలి. నిక్షయ్ మిత్ర కార్యక్రమం ద్వారా దాతలు పోష్టికాహార పదార్థాలు అందజేస్తారు.

లక్షణాలుంటే పరీక్ష చేసుకోవాలి



చిన్నారులకు బి.సి.జి టీకా వేయడం వల్ల వారు క్షయ బారిన పడే అవకాశాలు తక్కువ. ప్రభుత్వ ఆసుపత్రుల్లో టీబీ నిర్ధారణ పరీక్షలు చేసి, వ్యాధి సోకిన వారికి మందులు అందిస్తున్నాం. రెండు వారాల కంటే ఎక్కువ రోజులు దగ్గు ఉండి, సాయంత్రం జ్వరం వచ్చే వారు ఈ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలి. క్షయ నివారణ జిల్లాగా మార్చేందుకు అందరి సహకారం ఉండాలి.

– హరీశ్‌రాజ్, డీఎంహెచ్‌వో, మంచిర్యాల

ఆత్మీయ సమ్మేళనం



తాంసిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2002–03 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు 22 ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఒకరికొకరు ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించి పాదాభివందనం చేశారు. పూర్వ ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, రఘురమణ, బాపన్న, వాణిశ్రీ, పూర్వ విద్యార్థులు సురేశ్, శ్రీధర్‌రెడ్డి, సంజీవ్, కపిల్, అనిత, సునీత, గణిత, జ్యోత్స్న తదితరులు ఉన్నారు. – తాంసి

సింగరేణి కార్మికుల ప్రయోజనాలే ముఖ్యం

- ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్

నస్పూర్: సింగరేణిలో పనిచేస్తున్న కార్మికుల ప్రయోజనాలే ముఖ్యమని ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ అన్నారు. ఆదివారం నస్పూర్ కాలనీలోని సేవాభవన్ ఆవరణలో ఏర్పాటు చేసిన సింగరేణి, కాంట్రాక్టు, రిటైర్డు కార్మికుల ఆత్మీయ సదస్సులో పాల్గొని మాట్లాడారు. సింగరేణి సంస్థ మూతపడితే దక్షిణ భారత దేశ పారిశ్రామిక వ్యవస్థ అస్తవ్యస్తం అవుతుందన్నారు. గత బీఆర్‌ఎస్ పాలనలో అనేక భూగర్భ గనులు, ఓసీలు మూతపడ్డాయని ఆరోపించారు. జైపూర్ పవర్ ప్లాంటు ఏర్పాటు మాజీ సీఎం వైఎస్సార్ ఘనత అని, ఏటా రూ.500 కోట్ల లాభాలను సింగరేణి ఆర్జిస్తోందన్నారు. సింగరేణి మనుగడ కొనసాగాలంటే కొత్త గనులు రావాలన్నారు. ఇందుకు సింగరేణి సంస్థ బొగ్గు గనుల వేలంలో పాల్గొనాలన్నారు. డిపెండెంట్ల వయస్సు 35 నుంచి 40 ఏళ్లకు పెంచడం, ఉద్యోగులకు రూ.1.50 కోట్ల ఇన్సూరెన్స్, కాంట్రాక్టు కార్మికులకు ఇన్సురెన్స్ సదుపాయం కల్పించామని, 25 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు దీపావళి బోనస్ రూ.5 వేలు ఇప్పించామని అన్నారు. ఏరియా ఉపాధ్యక్షుడు శంకర్‌రావు, కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షులు నర్సింహారెడ్డి, సమ్మయ్య, ధర్మపురి, ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి, ఉప ప్రధాన కార్యదర్శులు తిరుపతిరెడ్డి, రమేశ్, శ్రీనివాస్, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి శ్యాం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

ఎద్దులను తరలిస్తున్న రెండు ట్రాలీలు పట్టివేత

కాసిపేట:అక్రమంగా రెండు ట్రాలీలలో 8 ఎద్దులను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..వాంకిడికి చెందిన షేక్ ఇసూబ్, షేక్ అసీంలు రెండు ట్రాలీలో 8 ఎద్దులను వాంకిడి, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మండలాల్లోని సంతల్లో కొనుగోలు చేశారు. ఎలాంటి అనుమతి లేకుండా రాజారాంపల్లి సంతలో విక్రయించేందుకు ట్రాలీలో వెళ్తున్నారు. శనివారం రాత్రి కాసిపేట పోలీసుస్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై మధుర జంక్షన్ వద్ద పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎద్దులను సంరక్షణ ని మిత్త ం సుల్తానాబాద్‌లోని గోశాలకు తరలించినట్లు పశువైద్యాధికారి పేర్కొన్నారు.

వ్యవసాయ భూమిలో గంజాయి సాగు

- 17 మొక్కలను ధ్వంసం చేసిన పోలీసులు

నేరడిగొండ: ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం కొర్టికల్ గ్రామ శివారులో గల వ్యవసాయ భూమిలో పడ్వాల్ దశరథ్ అనే రైతు అంతరపంటగా గంజాయి సాగు చేస్తున్నాడు. మూడేళ్లుగా భూమిని కౌలుకు తీసుకొని మిరప, వంగ, బెండ పంటల్లో అంతరంగా గంజాయి సాగు చేస్తున్నాడనే సమాచారం మేరకు పోలీసులు ఆదివారం తనిఖీ చేశారు. 17 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. దశరథ్‌తో పాటు ఆయన భార్య సాగర్‌బాయిపై కేసు నమోదు చేయగా, దశరథ్ పరారీలో ఉన్నాడు. సాగర్‌బాయిని అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పట్టుబడిన మొక్కల విలువ రూ.1లక్ష 70వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు.

రైతు అరెస్ట్

చెన్నూర్: మండలంలోని కొమ్మెర శివారులోని పత్తి చేనులో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్న రైతును అరెస్టు చేసినట్లు సీఐ దేవేందర్ తెలిపారు. మండలంలోని ఎర్రగుంటపల్లికి చెందిన రైతు జనగామ గట్టుమల్లు..కొమ్మెర శివారులో రెండెకరాల భూమిని కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాడు. అక్రమంగా గంజాయి పెంచితే డబ్బులు వస్తాయని ఆశతో చేనులో అక్కడక్కడ గంజాయి సాగు చేస్తున్నాడు. పక్కా సమాచారంతో పోలీసులు ఆదివారం చేనుకు వెళ్లి అక్రమంగా సాగు చేస్తున్న గంజాయి మొక్కలు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.గట్టుమల్లును రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈమేరకు కేసునమోదు చేసినట్లు తెలిపారు. ఎస్సై సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.


గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఇందన్‌పల్లి రేంజ్‌లో న్యాయమూర్తి


స్వాగతం పలుకుతున్న రేంజ్ అధికారి

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని ఇందన్‌పల్లి రేంజ్‌లో ఆదిలాబాద్ జిల్లా సివిల్ న్యాయమూర్తి ప్రమీల జైన్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం పర్యటించారు. న్యాయమూర్తికి రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ మొక్క అందించి స్వాగతం పలికారు. అనంతరం మైసమ్మకుంట, ఘనిశెట్టి కుంట, వాచ్‌టవర్ ప్రాంతాలను పరిశీలించారు. అడవి అందాలను చూసి మురిసిపోయారు. అడవి అభివృద్ధి, వన్యప్రాణుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను రేంజ్ అధికారి న్యాయమూర్తికి వివరించారు.

సైబర్ వలలో యువకుడు

- రూ.2.12 లక్షలు పోగొట్టుకున్న వైనం
- మందమర్రిలో ఘటన..కేసు నమోదు

మందమర్రిరూరల్: సైబర్ వలలో పడి యువకుడు రూ.2.12 లక్షలు పోగొట్టుకున్నాడు. మందమర్రిలో ఈఘటన చోటుచేసుకుంది. ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం..పట్టణానికి చెందిన యువకుడికి గూగుల్‌లో రివ్యూ ఇస్తూ డబ్బులు సంపాదించవచ్చని ఒక టెలీగ్రామ్ పేరిట నేరగాళ్ల నుంచి మేసెజ్ వచ్చింది. దానికి అంగీకరించడంతో అతన్ని 3వేల మంది ఉన్న టెలీగ్రామ్ గ్రూప్‌లో యాడ్ చేశారు. ముందుగా పెట్టుబడి రూపంలో కొన్ని డబ్బులు పెట్టాడు. అధిక మొత్తంలో ఆశచూపి తర్వాత రూ.2.12 లక్షలు పెట్టించారు. తర్వాత నగదు విత్ డ్రా చేసుకోవడానికి వీలు లేకుండా నేరగాళ్లు హ్యాక్ చేశారు. దీంతో మోసపోయానని గ్రహించిన యువకుడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తెలంగాణ ప్రజాఫ్రంట్ ఉమ్మడి జిల్లా మహాసభ

పాతమంచిర్యాల: జిల్లాకేంద్రంలోని చార్వాక ట్రస్టు భవన్‌లో ఆదివారం తెలంగాణ ప్రజాఫ్రంట్ ఉమ్మడి జిల్లా 3వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు సంజీవరావు మాట్లాడుతూ ప్రజాస్వామిక తెలంగాణ కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. సామ్రాజ్యవాద దేశాల మెప్పు కోసం పాలకులు పాటుపడుతున్నారని విమర్శించారు. ఓపెన్ కాస్టుల విధ్వంసం, టైగర్ జోన్‌లతో ప్రజలు నిర్వాసితులుగా మారుతున్నారన్నారు. ఓపెన్‌కాస్టుల విధ్వంసాన్ని ఆపాలని, టైగర్ జోన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మంచిర్యాల జిల్లా కమిటీ ఎన్నిక

అధ్యక్షుడిగా శ్రీ మన్నారాయణ, ప్రధాన కార్యదర్శి జైపాల్‌సింగ్, ఉపాధ్యక్షులుగా చంద్రయ్య, పోశం, అనంద్ సంతోష్, శ్రీనివాస్, సభ్యులుగా ఎన్నుకున్నారు. సమావేశంలో జైపాల్‌సింగ్, శ్రీమన్నారాయణ, ప్రజాకళామండలి నాయకులు సమ్మయ్య, చంద్రమౌళి, శ్రీనివాస్, రాజన్న, కుమార్ పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో ముగిసిన టెక్‌ఫెస్ట్


పరిశీలిస్తున్న ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్

బాసర: బాసర ఆర్జీయూకేటీలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అంత:ప్రజ్ఞ టెక్‌ఫెస్ట్ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఇంజినీరింగ్ విద్యార్థుల వినూత్న ఆలోచనలు, సామర్థ్యాలను ప్రదర్శించేందుకు టెక్‌ఫెస్ట్ నిర్వహించినట్లు ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ తెలిపారు. ఇందులో విద్యార్థుల ప్రాజెక్టు నమూనాలు, పోస్టర్ ప్రజెంటేషన్లు, తదితర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీధర్న్, ఏవో రణధీర్ సాగి, అసోసియేటెడ్ డీన్స్, వివిధ అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

26న మామిడిపండ్ల తోటల వేలం

ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ ఉట్నూర్ పరిధిలోని ఉద్యాన నర్సరీలో మామిడిపండ్ల తోటల వేలం ఈనెల 26న నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. బంగినపల్లి, దసేరి, తోతాపరి, రసాలు, హిమాయత్, లాంగ్ర తదితర మామిడి హైబ్రిడ్ రకాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వ్యాపారులు రూ.10 వేల డిపాజిట్ చెల్లించి ఉదయం 10 గంటలకు జరిగే వేలంలో పాల్గొనాలని కోరారు. వేలంలో తోట దక్కించుకున్నవారు సగం నగదును వెంటనే చెల్లించాలని మిగతాది వారంలో చెల్లించాలని సూచించారు. ఆ తర్వాతే కాయలు కోయడానికి అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు సెల్ 8897478825, 9441020755 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కుమురం భీం పేరుతో అవార్డులు గర్వకారణం

- మాజీ రాష్ట్ర ఎన్నికల అధికారి పార్థసారథి
- సినీనటుడు సాయికుమార్‌కు భీం అవార్డు ప్రదానం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే


కుమురం భీం జాతీయ అవార్డు అందుకుంటున్న సాయికుమార్

ఆసిఫాబాద్: కుమురం భీం పేరుతో జాతీయ అవార్డు ప్రదానం చేయడం ఆదివాసీ జాతికి గర్వకారణమని మాజీ రాష్ట్ర ఎన్నికల అధికారి పార్థసారథి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో భారత్ కల్చరల్ అకాడమీ, ఆదివాసీ సాంస్కృతిక పరిషత్, ఓం సాయితేజా ఆర్ట్స్, నవజ్యోతి సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ గోడం నగేశ్, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, హాస్య నటుడు బాబూమోహన్, మిమిక్రీ కళాకారుడు శివారెడ్డి, నవజ్యోతి వ్యవస్థాపకులు దండనాయకుల సురేశ్‌కుమార్, భీమ్ మనవడు సోనేరావుతో పాటు పలువురు సినీ ప్రముఖులతో కలిసి సినీనటుడు సాయికుమార్‌కు అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎన్నికల అధికారి పార్థసారథి మాట్లాడుతూ కుమురం భీం జీవితం ప్రతీ ఒక్కరికి స్ఫూర్తిదాయకమన్నారు. అడవి మీద హక్కుల కోసం జల్ జంగల్ జమీన్ నినాదంతో నిజాం పాలకులతో వీరోచితంగా పోరాడి అసువులు బాసిన వీరుడు కుమురం భీం అన్నారు. అవార్డు గ్రహీత సాయికుమార్ మాట్లాడుతూ కుమురంభీం సినిమాలో నటించి, భీమ్ నడియాడిన ప్రాంతంలో జాతీయ అవార్డు పొందడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కళాకారుడిగా పుట్టడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఎంపీ గోడం నగేశ్ మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి, కుమురం భీం చరిత్రను ప్రపంచం దృష్టికి తీసుకెళ్తున్న డి సురేశ్‌కుమార్‌ను అభినందించారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే మాట్లాడుతూ జిల్లాలో ఎంతోమంది ఉన్నత స్థాయి గిరిజన కళాకారులున్నారని, ఇటీవల గుస్సాడీ నృత్యానికి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం లభించిందని గుర్తు చేశారు. నవజ్యోతి సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకులు దండనాయకుల సురేశ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు, జలపాతాలు, ప్రముఖ దేవాలయాలు అభివృద్ధి చేయాలన్నారు. తొలుత జిల్లా కేంద్రంలోని సాయి మందిరం, అంకమ షా సమాధి మందిరాన్ని దర్శించుకున్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కుమురం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సినీ కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో యువ దర్శకుడు నక్క రాహుల్, నిర్మాత రాం సత్యనారాయణ, నటుడు రాంజగన్, బీజేపీ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు, ఆదివాసీ నాయకుడు సిడాం అర్జు, నవజ్యోతి సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులు డి.వెంకటేశ్వర్లు, సాయిని రాజశేఖర్, కళాకారులు, ఆదివాసీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

'భూభారతి'తో రెవెన్యూలో మార్పులు

మంచిర్యాలటౌన్: భూభారతి చట్టం 2025తో రెవెన్యూ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు రానున్నాయని తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి అన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సేవలందించేందుకు 10,954 మంది గ్రామపాలన అధికారులు వచ్చారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు సైనికులుగా పనిచేస్తామన్నారు. అనతికాలంలోనే ప్రభుత్వ సహకారంతో ఎన్నో విజయాలను సాధించుకున్నామని, తొలిసారి 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టులను ఏర్పాటు చేసి, పూర్వ వీఆర్‌ఏ, వీఆర్వోలను మాతృ సంస్థలోకి తీసుకోవడం గొప్ప విజయమన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాములు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, టీజీటీఆర్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బానాల రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి భిక్షం, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ఆలం పోచయ్య, ప్రధాన కార్యదర్శి అత్రం ప్రహ్లాద్, మహిళా విభాగం అధ్యక్షురాలు కె.శ్రావణి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ వీ.సంజీవ్ కుమార్, ఆదిలాబాద్ జాయింట్ కలెక్టర్ శ్యామలాదేవి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్డీవోలు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న లచ్చిరెడ్డి


పాల్గొన్న ఉమ్మడి జిల్లా రెవెన్యూ ఉద్యోగులు

నాణ్యమైన విద్యనందిస్తున్నాం


మాట్లాడుతున్న ఎల్వీ సూర్యనారాయణ

నస్పూర్: సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యాసంస్థలు, కళాశాలల్లో నాణ్యమైన విద్యనందిస్తున్నామని సింగరేణి డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ(ఆపరేషన్స్), కె. వెంకటేశ్వర్లు(ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు, పర్సనల్ అడ్మినిస్ట్రేషన్)తెలిపారు. సీసీసీ సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో శనివారం నిర్వహించిన 17వ వార్షికోత్సవానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి ఆధ్వర్యంలో విద్యాసంస్థల ద్వారా సింగరేణి ఉద్యోగుల పిల్లలకు, తెలంగాణలోని ఇతర విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన విద్యనందించి వారి బంగారు భవిష్యత్తుకు సంస్థ దోహదపడుతుందన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం వారు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్, సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ శ్రీనివాస్, కళాశాల కరస్పాండెంట్ రాజేశ్వర్, ప్రిన్సిపాల్ డి నరసింహస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

అడవిలో అమ్మవారి విగ్రహం

ఖానాపూర్: నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం రాజురా, బావాపూర్(ఆర్), మామడ మండలం కప్పనపల్లి గ్రామాల మధ్య గల దట్టమైన అడవిలో చాముండేశ్వరి అమ్మవారి విగ్రహం బయటపడింది. విగ్రహ పరిసర ప్రాంతంలో 14వ శతాబ్దానికి చెందిన కోట శిథిలాలను ప్రముఖ చరిత్ర పరిశోధకుడు, ఖానాపూర్ వాసి కరిపె రాజ్‌కుమార్ గుర్తించారు. కోట చుట్టూ చెక్కు చెదరని రాతి కంచె, ఇనుము శుద్ధిచేసిన ఆనవాళ్లు లభ్యమయ్యాయి. కోటకు ఆవల గుప్తానిధుల కోసం జరిపిన తవ్వకాల్లో ఇటీవల ఒక రాతి విగ్రహం బయటపడిందని వివరించారు. గ్రామాల ప్రజలు ఒక చిన్న చెట్టు కింద ఉంచారని, ఆ విగ్రహ ప్రతిమ చాముండేశ్వరి దేవత దని, కాకతీయ అనంతర శైలిలో విగ్రహం ఉందని తెలిపారు. దేవత చతుర్భుజి అని, పర(వెనుక) హస్తాలో ఢమరుకం, త్రిశూలం ఉన్నాయని, నిజ (ముందు) హస్తాలలో ఖడ్గం, రక్తపాత్రలతో సుఖాసీనురాలై ఉందన్నారు. చారిత్రక ప్రాశస్త్యం కలిగిన ఈ అమూల్యమైన విగ్రహాన్ని, కోట శిథిలాలను ప్రజలు సంరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. పరిశోధక బృందంలో ఔత్సాహిక పరిశోధక విద్యార్థి కరిపె రాజశేఖర్, గ్రామస్తుడు చిట్నేని పోతన్న ఉన్నారు.


చాముండేశ్వరి విగ్రహం